క్లుప్తంగా

క్రీడా దుస్తుల వితరణ


దాతలు అందించిన దుస్తులతో క్రీడాకారులు

పులిచెర్ల(కల్లూరు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కల్లూరు లయన్స్‌క్లబ్, లియోక్లబ్ ఆధ్వర్యంలో మహిళా క్రీడాకారులకు జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మద్ అలీ క్రీడాదుస్తులను ఉచితంగా 12 మందికి అందజేశారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో తమ ప్రతిభను చాటిన మహిళా క్రీడాకారులకు మహిళా దినోత్సవం సందర్భంగా తగిన రీతిలో గౌరవించడం జరిగిందన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ వేలంపాట

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పంచాయతీ మార్కెట్ వేలంపాట గురువారం నిర్వహించడం జరుగుతుందని స్థానిక సర్పంచ్ షకూర్, కార్యదర్శి యుగంధర్ తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలంపాట నిర్వహిస్తారన్నారు. దినసరి మార్కెట్, పంచాయతీ గదులు, ప్రైవేట్ బస్టాండు రుసుముకు సంబంధించి వేలం ఉంటుందన్నారు.

విశేష అలంకరణలో బాటగంగమ్మ



బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయ మండపం పూజల్లో భాగంగా బుధవారం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డి కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న పట్టభద్రుల పోలింగ్ కోసం అర్బన్‌కు రెండు, రూరల్‌కు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో మొత్తం 2,839 మంది ఓటర్లు ఓటింగ్ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు 297 మందికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామి సేవలో పెద్దిరెడ్డి


స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: చింతమాకులపల్లె పంచాయతీ బయ్యపల్లెలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. వీరిని గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. స్వామివారికి పెద్దిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్ర విశిష్టతను అర్చకులు వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సోమల మల్లికార్జునరెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, జీవన్‌రెడ్డి, హరీష్ తదితరులు ఉన్నారు.

వేలంపాటతో రూ.5.21 లక్షల ఆదాయం

పుంగనూరు: పట్టణంలో ఈనెల 14, 15న జరగనున్న శ్రీసుగుటూరు గంగమ్మ జాతర వేలంపాట బుధవారం సాయంత్రం జమీందారులు రాజాసోమశేఖర్ చిక్కరాయల్, రాజామల్లికార్జున చిక్కరాయల్ నిర్వహించారు. అమ్మవారి దర్శనం టికెట్లను రూ.2.71 లక్షలకు కేఎం మణి అనే వ్యాపారి వేలంపాటలో తీసుకున్నాడు. అలాగే పొట్టేళ్లు, దుకాణాల వేలంపాటలో మణికంఠ అనే వ్యాపారి రూ.2.50 లక్షలకు దక్కించుకున్నాడు. జాతర ద్వారా జమీందారులకు ఈసారి రూ.5.21 లక్షలు ఆదాయం వచ్చింది.

వైభవం.. బ్రహ్మ రథోత్సవం


స్వామివారి తేరు

పలమనేరు: మండలంలోని కూర్మాయిలో వెలసిన కూర్మవరదరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి బ్రహ్మ రథోత్సవం కనులపండువలా జరిగింది. ఆలయం వద్ద తొలుత మడుగు తేరును నిర్వహించారు. ఆపై రథాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో రథాన్ని లాగారు. కార్యక్రమంలో కూర్మాయి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నారీ.. మోగించు జయభేరి..



పలమనేరు: మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు, పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ గ్రీష్మబిందు

- వివక్ష లేని సమాజం కోసం కృషి చేద్దాం
- మహిళలను గౌరవించిన చోటే సమాజం బాగుంటుంది
- మహిళా దినోత్సవం వేడుకల్లో వక్తలు

పలమనేరు: సమాజంలో ఆడ, మగ అనే వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏపీఎన్జీఓల అధ్యక్షుడు ఆనంద్‌బాబు తెలిపారు. పలమనేరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో మహిళాదినోత్సవాన్ని ఏపీఎన్జీఓలు, పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అంతా మహిళలదే అని, నారీమణులు జయభేరి మోగించాలన్నారు. ఎక్కడైతే మహిళలను గౌరవిస్తారో అక్కడి సమాజం పవిత్రంగా ఉంటుందన్నారు. నేటి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందుకున్న పలువురు మహిళలు సునంద, మంగేశ్వరి, విజయలక్ష్మి, ఉషారాణి, రమాదేవి, జగదీశ్వరి, నీలిమ, నాగరత్న, వెంకటలక్ష్మమ్మను సన్మానించారు. కార్యక్రమంలో పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు, ఎన్జీఓల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, జయమ్మ, ఇందిర, సర్తాజ్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్యురాలు డా.మమతారాణిని సన్మానించారు. పట్టణంలోని బాలాజీ సూపర్‌బజార్‌లో సంఘ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్ ఆధ్వర్యంలో మహిళలకు పసుపు కుంకుమను అందించి శుభాకాంక్షలను తెలిపారు. అలాగే పట్టణ సమీపంలోని రిమ్మర్స్ బుద్ధిమాంద్యం పాఠశాలలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల డైరెక్టర్ డా.సుధాకర్ మాట్లాడుతూ బుద్ధిమాంద్యం పిల్లలకు సేవలు అందిస్తున్న మహిళలకు సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గాయత్రి, జేవీవీ అధ్యక్షురాలు ప్రమీళ, ఏఎన్‌ఎం మంగమ్మ, ఆశావర్కర్ నీరజను సన్మానించారు. పట్టణ సమీపంలోని సిల్క్‌ఫామ్‌లో స్థానిక ఐద్వా ఆధ్వర్యంలో ఇదే కార్యక్రమం జరిగింది. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి అమరనాథ రెడ్డి సతీమణి రేణుకారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.


వి.కోట: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పుంగనూరులో..

పుంగనూరు: మండలంలోని మోదుగులపల్లెలో బుధవారం సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధు మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జశ్వంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్రీష్మబిందు మహిళలతో కలసి కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వి.కోట: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే కుటుంబంతో పాటు గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సురేంద్రగౌడ్ అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది మాతృమూర్తులను సన్మానించారు. ఎంఈఓ చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ సభ్యుడు పాల్గొన్నారు.

అన్ని రంగాలపై అవగాహన ఉండాలి..

మహిళలు అన్ని రంగాలపై అవగాహన పెంపొందించుకుని ప్రతి రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఏఓ రాజ్యలక్ష్మి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వద్ద జైకిసాన్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

సదుంలో..

సదుం: స్థానిక మహిళా సమాఖ్య భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని లింగాపురం సమీపంలో ఉన్న మదర్ థెరిసా పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో పని చేస్తున్న 200 మంది మహిళా ఉపాధ్యాయులను స్కూల్ కరస్పాండెంటు రవీంద్రబాబు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారి శ్రేయ, డీన్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపల్ డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పలమనేరు ఏరియా ఆస్పత్రిలో..


పెద్దపంజాణి: సత్కారం అందుకున్న మహిళా టీచర్లతో మదర్‌థెరిసా స్కూల్ డైరెక్టర్ కుమారి శ్రేయ


మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తులు సింధు, వాసుదేవరావు

సప్తగిరి గ్రామీణ బ్యాంకులో..



చౌడేపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీపీ రామ్మూర్తి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, ఏపీఎం నర్వోత్తమరెడ్డి, బ్యాంకు మేనేజరు ఏడుకొండలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు వెంకటరమణ ఉన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం వడదెబ్బ నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఎండల సమయంలో ఆరుబయట ప్రయాణించాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు వడదెబ్బకు గురవుతారన్నారు. బాలింతలు చిన్న పిల్లలకు తల్లిపాలు ఎక్కువసార్లు తాగించాలన్నారు. మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్ల బాగా తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోండి


పలమనేరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విక్టర్ ప్రసాద్

పలమనేరు: నిమ్నజాతి పట్టాల భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు స్థానిక ఎస్సీ సంఘ నేతలు విన్నవించారు. బుధవారం పలమనేరుకు విచ్చేసిన ఆయనకు స్థానిక ఎస్సీ సంఘం నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన వారితో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఎస్సీ ఉపాధ్యాయుల సంఘ నాయకులు పుష్పరాజ్ ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా నిమ్నజాతి పట్టాలు అన్యాక్రాంతం అవుతున్నా, దీనిపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సర్వే నెం.507/1బి/సీలో 2.55 సెంట్ల భూమిలో ఎస్సీయేతరులు పక్కా భవనాలను నిర్మిస్తున్నా అడిగేవారు లేకుండా పోయారని వివరించారు. దీనిపై విచారణ జరిపించాలని విన్నవించారు. ఈ విషయంపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎస్సీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వాహన రికార్డులతో పోలీస్‌స్టేషన్‌కు రండి

పలమనేరు: పోలీసులు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల యజమానుల వివరాలు తెలియలేదని, నిజమైన యజమానులు ఉంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వాహన రికార్డులను చూపాలని సీఐ చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. గతంలో పట్టుబడిన ఏపీ03ఏపీ 2595 అనే హీరోహోండా ప్యాషన్ ప్రోబైక్, ఏపీ03ఏటీ8398 నంబరు గల టాటానానో కారు యజమానుల వివరాలు తెలియరాలేదన్నారు. అందువల్ల నిజమైన వారు తమను సంప్రదించాలని అందులో సూచించారు.

12న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక


మాట్లాడుతున్న రామ్మూర్తి, రామకృష్ణ

పుంగనూరు: బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమం ఈనెల 12న తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న ఆశ్రమ కల్యాణ మండపంలో జరుపుతున్నట్లు బ్రాహ్మణ సంఘ కార్యదర్శి రామ్మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతిలోని బీమాస్ బాలాజీ, కొత్తపల్లె అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పరిచయ వేదిక జరుగుతోందన్నారు. వధూవరులు తమ పేర్లను నమోదు చేసుకుని, పరిచయ వేదికకు హాజరు కావాలన్నారు. వివరాలకు 93904 27018, 63021 36315 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మధుకుమార్ శర్మ, రామకృష్ణశర్మ, అశ్వర్థనారాయణ, కృష్ణమూర్తిరావు పాల్గొన్నారు.

పేర్నాటి, పర్వతరెడ్డిని గెలిపించుకుందాం




పుంగనూరు: కుమ్మరగుంటలో ప్రచారం చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, మునస్వామి, పలమనేరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కౌన్సిలర్లు, కల్లూరులో..

- ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు పలు ప్రాంతాల్లో ప్రచారాలు ముమ్మరం చేశారు. మండలంలోని కుమ్మరగుంట, కొండమదొడ్డి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ మునస్వామి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అలాగే మంగళం గ్రామ పంచాయతీలో నాయకులు రాజారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే మున్సిపాలిటీలోని ప్యాలెస్ కాంపౌండు, దోబీకాలనీ, కొత్తపేట ప్రాంతాల్లో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, కౌన్సిలర్లు ఆదిలక్ష్మి, మమత, మాజీ కౌన్సిలర్ శోభారాణి ప్రచారం చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులతో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాయలసీమ తూర్పు నియోజకవర్గాల పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను విన్నవించారు. రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపిద్దామని రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. కల్లూరులో బుధవారం పట్టభద్రుల ఓటర్లను కలుసుకుని తొలి ప్రాధాన్యత ఓటును శ్యామ్‌ప్రసాద్ రెడ్డికే వేయాలని సూచించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించుకుందాం

రొంపిచెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోటా వెంకటరమణ అన్నారు. ఆయన బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని ఆర్‌సీ పురం కాలనీ, సర్వర్‌పేట, ఫజులుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై నీలమేఘశ్యాముడు


అశ్వవాహనంపై స్వామివారు

శాంతిపురం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజైన బుధవారం రాళ్లబూదుగూరులో శ్రీకోదండరామ స్వామి వారు అశ్వవాహనంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో సీతాలక్ష్మణ సమేతుడైన స్వామివారికి అలంకార తిరుమంజనం, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై అధిష్టించిన స్వామివారిని బలిజ కులస్తులు ఉభయదారులుగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారి దోపోత్సవం, అన్నదానం, నయ్యాండి డ్యాన్సు, ఆర్కెస్ట్రా, బాణ వేడుకలు నిర్వహించారు. గురువారం ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై నుంచి భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.

అన్నదాన స్థలదాతకు ఘన సన్మానం


ఉమారెడ్డెమ్మను సన్మానిస్తున్న అతిథులు

పలమనేరు: కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదానం నిర్వహణకు తన భూమిని విరాళంగా అందించిన స్థలదాత ఉమారెడ్డెమ్మను ఘనంగా సన్మానించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కృష్ణమూర్తి రెడ్డి బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాణి కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీవాణి, శ్రీధర్‌స్వామి, చంద్రతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

త్యాగానికి మారుపేరు మహిళ


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వక్తలు

కుప్పంరూరల్: త్యాగానికి మారుపేరు మహిళ అని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంజినీరింగ్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బీసీఎన్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ శాంతనాగరాజు మాట్లాడుతూ స్త్రీ లేకపోతే సృష్టిలో జీవమే లేదన్నారు. అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యురాలు ఉమా మాట్లాడుతూ అధునాతన యుగంలో మహిళలు ప్రతి రంగంలో రాణించడం గర్వకారణమన్నారు. ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ సుమతి మాట్లాడుతూ మాతృదేవోభవ అంటూ మహిళలను దేవతలతో పోల్చుకున్న దేశం భారతదేశమన్నారు. విద్యార్థినులు చేపట్టిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, భాస్కరన్, కోదండరామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీలోనే విద్యకు అధిక ప్రాధాన్యత


గ్రామాల్లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రామకుప్పం: ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగడానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని పట్టభద్రులు గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండల పరిధిలో బాబురెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్‌లకు ధీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. నాడు–నేడు ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతోందని, అదేవిధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నేతలు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు


పుంగనూరు ప్యాలెస్‌లో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: పట్టణంలో ఈనెల 14, 15న జరగనున్న శ్రీసుగుటూరు గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహిస్తామని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డితో కలసి ప్యాలెస్‌ను పరిశీలించారు. ప్యాలెస్ పురాతన భవనం కావడంతో ముందు జాగ్రత్తగా అక్కడ రద్దీని నియంత్రిస్తామన్నారు. అలాగే తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దొంగతనాలు జరగకుండా అధికసంఖ్యలో పోలీసులను బందోబస్తుకు కేటాయిస్తున్నామని చెప్పారు. మఫ్టీలో పోలీసులను ఉంచుతామన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో జాతర జరుపుకోవాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఈ కృష్ణకుమార్, ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


సోడిగానిపల్లెలో ప్రకృతి వ్యయసాయంపై ర్యాలీ చేస్తున్న సభ్యులు

గుడుపల్లె: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని ఎంసీఏ మునికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని సోడిగానిపల్లెలో ఎంపీటీసీ లక్ష్మీదేవి, వైఎస్సార్ క్రాంతిపథకం మహిళలకు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం ఉండదన్నారు. జీవామృతం కషాయాల వంటి పదార్థాలను సొంతంగా తయారు చేసుకోవాలన్నారు. పొలాల వద్ద ఉన్న వ్యర్థ పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవడం, దీనికితోడు వివిధ రకాలకు చెందిన ఆకులతో చేసిన కషాయాలు పంటలకు వాడుకోవచ్చన్నారు. దీంతో భూమి సారవంతంగా ఏర్పడి పంటలకు తేమశాతం అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన సిరిధాన్యాలను వాడితే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రతిఒక్కరూ ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీసీ మునిరత్నం, మురుగేష్, లక్ష్మీపతి, శ్రీదేవి పాల్గొన్నారు.

రంగుల రంగేలి.. హోలీ


రంగులు చల్లుకుంటున్న యువకులు


హోలీ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

పలమనేరు: పట్టణంలోని రాజస్తానీ కుటుంబాలు బుధవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా అందరి జీవితాల్లో రంగుల వెలుగులు నిండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జైసింగ్, రాజేష్, ఓంప్రకాష్, బోలారామ్, హరిరామ్, గోవింద్, గణపతి, ధర్మారామ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వి.కోటలో

వి.కోట: మండలంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. మండలవ్యాప్తంగా ఉన్న మార్వాడీలు హోలీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. స్థానికంగా వెలసిన మాతాజీ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.